మార్కెట్లను ముంచిన వైరస్

భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు • సెన్సెక్స్ 1,258, నిఫ్టీ 388 పాయింట్ల పతనం

ముంబై, జనవరి 6: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. దేశంలో హెచ్ఎంపీవీ కేసులు నమోదుకావడంతో సూచీలు అమ్మకాలు ఒత్తిడికి గురయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కార్పొరేట్లు నిరుత్సాహక ఆర్థిక ఫలితాలు ప్రకటించే అవకాశాలుండటంతోపాటు ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన బలహీన సంకేతాలకు తోడు, విదేశీ మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. వరుసగా రెండోరోజు 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 78 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఇంట్రాడేలో 1,441 పాయింట్లు నష్టపోయి 77,781 పాయింట్ల వద్దకు చేరుకున్న సూచీ చివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించింది. మార్కెట్ ముగిసే సమయానికి 1,258.12 పాయింట్లు లేదా 1.59 శాతం నష్టపోయి 77,964.99 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ కూడా 24 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 388.70 పాయింట్లు లేదా 1.62 శాతం నష్టపోయి 23,616.05 వద్ద స్థిరపడింది.

తొలిరోజే స్టాండర్డ్ గ్లాస్ జోరు

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవో తొలిరోజే మదుపరుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రారంభించిన నిమిషాల్లోనే కంపెనీ షేర్లు అమ్ముడైపోగా, తొలిరోజు 13.32 రెట్లు అధికంగా బిడ్డింగ్ దాఖలయ్యాయి. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 2,08,29,567 షేర్లను అమ్మకానికి పెట్టగా, వీటికి 27,75,00,862 షేర్ల బిడ్డింగ్ దాఖల్యయాయి.

- టాటా స్టీల్, ఎన్‌టీపీసీ, కొటక్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, అదానీపోర్ట్స్‌లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు జొమాటో, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, రిలయన్స్, మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే, ఎస్బీఐ, యాక్సిస్ బ్యాంక్, టాటా మోటర్స్, మారుతి, ఎల్‌అండ్‌టీ, హెచ్ యూఎల్, బజాజ్ ఫైనాన్స్, ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, టీసీఎస్, ఐసీఐసీఐ, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి.
- కేవలం టైటాన్, హెచ్‌సీఎల్‌టెక్నాలజీ షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి.
- 3,474 సూచీలు నష్టపోగా, 656 సూచీలు లాభాల్లో ముగిశాయి. కేవలం 114 షేర్లు యథాతథంగా ట్రేడయ్యాయి.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.17 శాతం, మిడ్ క్యాప్ 2.44 శాతం నష్టపోయాయి.
- రంగాలవారీగా చూస్తే యుటిలిటీ అత్యధికంగా 4.16 శాతం నష్టపోగా, పవర్ 3.73 శాతం, సర్వీసెస్ 3.45 శాతం, మెటల్ 3.15 శాతం, ఆయిల్‌అండ్‌గ్యాస్ 3.15 శాతం, ఎనర్జీ 3.03 శాతం, ఇండస్ట్రియల్స్ 2.97 శాతం, కమోడిటీస్ 2.74 శాతం చొప్పున పతనం చెందాయి.

11 లక్షల కోట్ల సంపద ఆవిరి

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాలతో మదుపరులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గత కొన్ని రోజులుగా లాభాలతో కళకళలాడిన మదుపరుల్లో ఉత్సాహం వైరస్ దెబ్బకు ఆవిరైపోయింది. దీంతో అమ్మకాల బటన్ నొక్కడంతో సోమవారం ఒకేరోజు 10 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయారు. సూచీల భారీ నష్టంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.10,98,723.54 కోట్లు కరిగిపోయి రూ.4,38,79,406.58 కోట్లు(5.11 ట్రిలియన్ డాలర్లు) పడిపోయింది.

- ఎఫ్ఐఐలు రూ.2,575 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

పతనానికి కారణాలు ఇవే..

- హ్యూమన్ మెటానియా వైరస్ కేసులు భారత్‌లోనూ నమోదు కావడం
- దేశీయ ఈక్విటీ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాల కొనసాగుతుండటం.
- ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన బలహీన సంకేతాలు
- మూడో త్రైమాసికంలో కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు

80 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, జనవరి 6: బంగారం ధరలు శాంతించాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర 80 వేల దిగువకు పడిపోయింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర సోమవారం ఒకేరోజు రూ.700 తగ్గి రూ.79 వేలకు తగ్గినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. కానీ, వెండి మాత్రం రూ.300 పెరిగి రూ.90,700గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర స్వల్పంగా పెరిగి 2,659.60 డాలర్లకు చేరుకోగా, వెండి 30 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

ఆర్బీఐ చేతికి 8 టన్నుల గోల్డ్

ముంబై, జనవరి 6: వివిధ దేశాల్లోని కేంద్రబ్యాంకులు వ్యూహాత్మకంగా పసిడి నిల్వలను పెంచుకుంటున్నాయి. గతేడాది నవంబర్ నెలలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లు 53 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేయగా, దీంట్లో రిజర్వుబ్యాంక్ 8 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను అధిగమించడానికి సెంట్రల్ బ్యాంకులు పసిడి నిల్వలను పెంచుకోవడానికి అధికప్రాధాన్యతనిస్తున్నాయి. దీంతో బంగారానికి అనూహ్యంగా డిమాండ్ నెలకొన్నది. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పడిపోయాయి. దీంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో భాగంగా సెంట్రల్ బ్యాంక్‌లు భారీగా పుత్తడిని కొనుగోళ్లు చేశాయి.

టైటాన్‌కు పండుగ కిక్కు

న్యూఢిల్లీ, జనవరి 6: టాటా గ్రూపునకు చెందిన టైటాన్ కంపెనీ అంచనాలకుమించి రాణిస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 24 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. పండుగ సీజన్‌కావడంతో ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉండటమే ఇందుకు కారణమని వెల్లడించింది. ఈ త్రైమాసికంలో దీపావళి పండుగతోపాటు ధంతేరస్ ఉండటంతో ఆభరణాల విక్రయాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని, అలాగే బంగారు నాణేల అమ్మకాలు 48 శాతం చొప్పున పెరిగాయని పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్లో వ్యాపార విస్తరణలో భాగంగా ఒకేసారి అమెరికా, దుబాయ్‌ల్లో స్టోర్లను ప్రారంభించింది.

మారుతి కార్లపై 2 లక్షల రాయితీ

ఫ్రాంక్స్, బాలెనో, జిమ్నీ, విటారాలపై ఈ డిస్కౌంట్లు

న్యూఢిల్లీ, జనవరి 6: కార్ల తయారీలో అగ్రగామి సంస్థ మారుతి సుజుకీ కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. ఒకవైపు ధరలు పెంచుతూనే మరోవైపు ఎంపిక చేసిన మాడళ్లపై ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. నూతన సంవత్సరంలో నెక్సా షోరూంలో పలు మాడళ్లను కొనుగోలు చేసిన వారికి రూ.2.5 లక్షల వరకు రాయితీ పొందవచ్చునని సూచించింది. ప్రీమియం వాహనాలను విక్రయించడానికి ఈ ప్రత్యేక షోరూంలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిలో ఫ్రాంక్స్, బాలెనో, జిమ్నీ, విటారా మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

ఎక్స్ఎల్6పై రూ.50 వేల రాయితీ

ప్రీమియం మల్టీపర్పస్ వాహనమైన ఎక్స్ఎల్6ని రూ.50 వేల వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. దీంట్లో స్క్రాపింగ్ బోనస్ కింద రూ.25 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.20 వేలు ఇస్తున్నది. ఈ ఆఫర్లు పెట్రోల్, సీఎన్‌జీ మాడళ్లకు మాత్రమే వర్తించనున్నదని, డీజిల్ వాహనానికి వర్తించని స్పష్టంచేసింది.

బాలెనోపై 90 వేల డిస్కౌంట్

బాలెనో కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి సంస్థ ఏకంగా ఈ వాహనంపై రూ.90 వేల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నది. దీంట్లో కన్స్యూమర్ డిస్కౌంట్ కింద రూ.40 వేలు, ఇతర రాయితీల కింద మరో రూ.20 వేలు అందిస్తున్నది. అలాగే ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.15 వేలు, స్క్రాపింగ్ బోనస్ కింద రూ.20 వేలు ఇస్తున్నది.

ఇగ్నిస్‌పై 90 వేలు..

ఇగ్నిస్ మాడల్‌పై రూ.75 వేల వరకు డిస్కౌంట్ ఇస్తున్నది. దీంట్లో కన్స్యూమర్ డిస్కౌంట్ కింద రూ.45 వేలు, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.15 వేలు, స్క్రాపింగ్ బోనస్ కింద రూ.30 వేలు, కార్పొరేట్ రాయితీ కింద మరో రూ.2,100 రాయితీ ఇస్తున్నది.

గ్రాండ్ విటారాపై 1.18 లక్షలు

గ్రాండ్ విటారాపై రూ.1.18 లక్షల వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నది సంస్థ. దీంట్లో కన్స్యూమర్ డిస్కౌంట్ కింద రూ.65 వేలు, స్క్రాపింగ్ బోనస్ కింద రూ.50 వేలు, కార్పొరేట్ బోనస్ కింద మరో రూ.3,100 ఇస్తున్నది.

జిమ్నీపై రూ.1.9 లక్షలు

జిమ్నీ మాడల్‌పై రూ.1.9 లక్షల వరకు తగ్గింపు ధరతో మారుతి విక్రయిస్తున్నది.

ఇన్విక్టోపై రూ.2.15 లక్షలు రాయితీ

మారుతి మాడళ్లలో అత్యధికంగా ఇన్విక్టో మాడల్‌పై రూ.2.15 లక్షల వరకు రాయితీ ఇస్తున్నది. దీంట్లో ఎక్స్ఛేంజ్ బోనస్ కింద లక్ష రూపాయలు డిస్కౌంట్ కల్పించిన సంస్థ..స్క్రాపింగ్ బోనస్ కింద మరో లక్ష రూపాయలు రాయితీ కల్పిస్తున్నది.

వెండి ఆభరణాలపై హాల్‌మార్కింగ్!

ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 6: వెండిపై కూడా హాల్‌మార్కింగ్‌కు సిద్ధమవుతున్నది కేంద్ర ప్రభుత్వం. ఇప్పటికే బంగారు, ఆభరణాలపై హాల్‌మార్కింగ్ విజయవంతంగా పూర్తికావడంతో కన్స్యూమర్ల నుంచి వస్తున్న డిమాండ్‌తో వెండితోపాటు వెండి కళాఖండాలపై కూడా హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దీంతో వీటిపై కూడా హాల్‌మార్కింగ్‌ను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అమలు చేయాలని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోష్ సూచించారు. వినియోగదారుల నుంచి డిమాండ్ అధికంగా వస్తున్నదని, దీనిని వెంటనే అమలులోకి తేవాలని 78వ బీఐఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి వెల్లడించారు. ఇప్పటికే ఈ దిశగా పనులు ప్రారంభమయ్యాయని, బీఐఎస్ ద్వారా వాటాదారులతో సంప్రదింపులు, సాధ్యాసాధ్యాలపై పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వ్యాఖ్యానించారు. వెండిపై హాల్‌మార్కింగ్‌పై వాటాదారుల నుంచి, అటు కన్స్యూమర్, ఆర్నమెంట్ డీలర్ల నుంచి సమాచారాన్ని సేకరించాలని బీఐఎస్‌కు మంత్రి సూచించారు. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఆభరణాల్లో 90 శాతం హాల్‌మార్కింగ్ కలిగినవని, 44.28 కోట్ల బంగారు ఆభరణాలు హాల్‌మార్కింగ్‌తో తయారైనవి అమ్ముడయ్యాయని మంత్రి చెప్పారు. దీనిపై బీఐఎస్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ..వచ్చే మూడు నుంచి ఆరు నెలల్లో వెండిపై హాల్‌మార్కింగ్‌ను అమలులోకి తేవడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. వెండి నాణ్యతను గుర్తించే విధానంపై ఇప్పటికే పలుదఫాలుగా చర్చలు జరిపినట్లు, ఆరు డిజిట్ ఆల్ఫాన్యూమెరిక్ కోడ్ కలిగిన నంబర్‌ను ప్రింటింగ్ వేసి ఇవ్వనున్నట్లు చెప్పారు. జూన్ 2021లో ప్రవేశపెట్టిన గోల్డ్ హాల్‌మార్కింగ్ విజయవంతంగా అమలు చేయబడుతున్నదని, ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 361 జిల్లాలను కవర్ చేయగలిగామన్నారు.

వెయ్యి కోట్లతో చిప్‌ల తయారీ కేంద్రం

రాష్ట్రంలో ఏర్పాటుచేయడానికి ముందుకొచ్చిన పీటీడబ్ల్యూ



హైదరాబాద్, జనవరి 6(నమస్తే తెలంగాణ): సెమీకండక్టర్ పరిశ్రమలకు అవసరమైన విడిభాగాలు, ఆటోమేషన్ పరికరాల తయారీ సంస్థ పీటీడబ్ల్యూ..హైదరాబాద్‌లో రూ.1,000 కోట్ల పెట్టుబడితో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ భారీ పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన ఉత్పాదక కేంద్రం మొదటి దశకు తాము సిద్ధంగా ఉన్నట్లు పీటీడబ్ల్యూ ఆసియా విభాగ ఎండీ టార్ స్టెన్ సెయ్ ఫ్లైడ్ పేర్కొన్నారు. ఈ యూనిట్ ఏర్పాటునకు సంబంధించి సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా సమావేశమై వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సెమీ కండక్టర్(చిప్)ల తయారీ, దాని అనుబంధ పరిశ్రమలకు అనుకూల వాతావరణం హైదరాబాద్‌లో ఉన్నదని వెల్లడించారు. పరిశ్రమ ఏర్పాటు చేసే పక్షంలో ప్రభుత్వ విధానాల ప్రకారం రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఇక్కడ నైపుణ్యం కలిగిన మానవ వనరులకు కొదవ లేదని, సరైన ప్రతిపాదనలతో వస్తే తమ ఆహ్వానం ఎప్పటికీ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సంస్థ స్థానిక భాగస్వామి బార్ ట్రానిక్స్ ఎండీ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో 'చెమట చుక్కలకు తర్పీదు'

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : సింగరేణి కార్మికుల పిల్లలు దేశ విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలా 'చెమట చుక్కలకు తర్పీదు' కార్యక్రమానికి సింగరేణి సంస్థ శ్రీకారం చుట్టింది. సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహ ప్రాంగణంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరాం మాట్లాడుతూ సింగరేణి కార్మికుల పిల్లలు చిన్న ఉద్యోగాలకు పరిమితం కాకుండా దేశ, విదేశాల్లో ఉన్నతోద్యోగాలు పొందేందుకు కార్యక్రమం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంధనశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ పాల్గొన్నారు.

తాత్కాలికంగా ఎస్ఎస్ఏ సమ్మె వాయిదా

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : డిమాండ్లను నెరవేర్చాలంటూ సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు తమ సమ్మెను తాత్కాలికంగా వాయిదావేశారు. సోమవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం ఎస్ఎస్ఏ ఉద్యోగులతో చర్చలు జరిపారు. సమ్మె కాలానికి వేతనం సహా పలు అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించగా, పే స్కేల్‌పై క్యాబినెట్ సబ్ కమిటీ త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి తెలిపారు.

శ్రీశైలంలో చిరుత కలకలం

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): శ్రీశైలం దేవస్థానం పరిసర ప్రాంతంలో చిరుత పులి సంచరించడం కలకలం రేపింది. పాతాళగంగ మెట్ల మార్గంలో నివసిస్తున్న దేవస్థానం పూజారి సత్యనారాయణ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చిరుత ప్రవేశించింది. చిరుత సంచారాన్ని సీసీటీవీ ఫుటేజీలో చూసిన సిబ్బంది అవాక్కయ్యారు. చిరుత ఇంట్లోకి వచ్చిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కాగా, జనావాసాల్లోకి చిరుత రావటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు చిరుత కదలికలపై ఆరా తీస్తున్నారు.

ఐఏఎంసీకి భూమి కేటాయింపు సబబే

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదన • తదుపరి విచారణ 20కి వాయిదా

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కి 5 ఎకరాల భూమిని కేటాయించడం సబబేనని రాష్ట్ర ప్రభుత్వం సమర్థించుకున్నది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రానికి వివిధ రూపాల్లో లబ్ధి చేకూరుతుందని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి సోమవారం హైకోర్టులో వాదించారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ కూడా మధ్యవర్తిత్వ సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఐఏఎంసీ ట్రస్టీలుగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రెండో ట్రస్టీగా రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఉంటారని, అంతర్జాతీయ స్థాయిలో ఐఏఎంసీని ఏర్పాటు చేసినందున ప్రభుత్వం భూమిని కేటాయించిందని వివరించారు. ఐఏఎంసీ తరపున సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. చాలా దేశాల్లో ఈ విధానానికి మంచి ఆదరణ లభిస్తున్నదని, మన దేశంలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. దీంతో తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేస్తున్నట్టు జస్టిస్ కే లక్ష్మణ్, జస్టిస్ కే సుజన ధర్మాసనం ప్రకటించింది.

మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలి: జస్టిస్ లక్ష్మణ్

దేశవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జస్టిస్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మధ్యవర్తిత్వం లాంటి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా కక్షిదారులు కేసులను పరిష్కరించుకునే విధానాన్ని ప్రోత్సహించాలని ఈ విచారణ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

కాలుష్యాన్ని పెంచేస్తున్నాయ్!

రోడ్లపైకి వేలాది డొక్కు వాహనాలు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాహనాల నుంచి వచ్చే కాలుష్య ఉద్గారాల పరిమాణం రోజురోజుకూ ఆందోళన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నా, ప్రజలు కొనుగోలు చేసేందుకు ముందుకు రావటం లేదు. ఇందుకు నిదర్శనమే గత సెప్టెంబర్‌లో కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ గణాంకాలు. గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆరు ప్రాంతాలతోపాటు జిల్లా కేంద్రాల్లో ఉచిత పీయూసీ నిర్వహించగా వందల సంఖ్యలో మాత్రమే తనిఖీలు చేయించుకున్నారు. వాహనాల నుంచి 61.4 శాతం కార్బన్‌డయాక్సైడ్, 34 శాతం హైడ్రోకార్బన్, 0.54 శాతం సల్ఫర్‌డయాక్సైడ్, 0.18 సస్పెండెడ్ పార్టిక్యులేట్ మ్యాటర్, 0.023 శాతం లెడ్ విడుదలవుతున్నట్టు అధికారులు చెప్తున్నారు.

విద్యార్థులపై సీనియర్ల దాడి

పటాన్‌చెరు, జనవరి 6: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బీసీ హాస్టల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులపై టెన్త్ విద్యార్థి తన స్నేహితులతో కలిసి దాడిచేశాడు. వెలిమెల మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివే బాలాజీ, తొమ్మిదో తరగతి చదువుతున్న సాయి, కార్తిక్ తన బట్టలు ఉతకలేదని కోపంతో తన స్నేహితులతో కలిసి వారిపై దాడిచేయగా కేసు నమోదైంది.

దేశ రక్షణలో ఎంఈఎస్ అధికారుల పాత్ర కీలకం

ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ శశాంక్ గోయల్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): దేశ రక్షణ సామర్థ్యాలకు తోడ్పాటు నందించడంలో మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ అధికారుల పాత్ర కీలకమని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ శశాంక్ గోయల్ పేర్కొన్నారు. నూతనంగా మిలిటరీ ఇంజినీర్ సర్వీసెస్ ఫౌండేషన్ కోర్సును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును పుణెలోని కాలేజ్ ఆఫ్ మిలిటరీ ఇంజినీరింగ్ స్పాన్సర్ చేసినట్టు తెలిపారు. ఎంఈఎస్ కేవలం వ్యక్తికి సంబంధించినది కాదని, మన దేశ రక్షణ సంసిద్ధతను అత్యున్నత స్థాయిలో ఉంచే జట్టు నాయకుడి పాత్ర అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌అండ్‌డీ అడిషనల్ చీఫ్ ఇంజినీర్ జే సతీశ్ భరద్వాజ, సీడీఎస్ కోర్సు డైరెక్టర్ అండ్ హెడ్ కందుకూరి ఉషారాణి, అకడమిక్ కోఆర్డినేటర్ అబ్బాస్ అలీ, అడిషనల్ కోర్సు డైరెక్టర్ కే చంద్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉమెన్ సేఫ్టీపై శిక్షణ

శిఖాగోయల్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 6 (నమస్తేతెలంగాణ): ఉమెన్ సేఫ్టీపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఉమెన్ సేఫ్టీ వింగ్ డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్ వెల్లడించారు. ఇందుకు ఉప్పల్, నాగోల్, రామంతాపూర్ జిల్లా పరిషత్ స్కూళ్లను పైలట్ ప్రాజెక్టుగా ఎంపికచేసినట్టు సోమవారం పేర్కొన్నారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డైరెక్టర్ ఆఫీసులో పోస్టర్లను ఆవిష్కరించారు. 1,036 మంది విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. స్మితాహాగ్డే, శోభన ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల శ్రమతోనే దేశ సంపద సృష్టి

మోదీ ఆలోచనంతా అదానీ, అంబానీల కోసమే: డీ రాజా

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): దేశ సంపదలో 90 శాతం దళితుల శ్రమతోనే సృష్టించబడుతున్నా.. దళితులు, ఆదివాసీలు, అట్టడుగు శ్రామికవర్గాలు ఇంకా అణచివేతకు గురవుతున్నారని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఆలోచనంతా అదానీ, అంబానీల కోసమేనని విమర్శించారు. హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం(ఏఐడీఆర్ఎం) జాతీయ రెండో మహాసభలను డీ రాజా సోమవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మల్లెపల్లి లక్ష్మయ్య, చాడ వెంకటరెడ్డి, ఏఐడీఆర్ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి, రాధాకృష్ణన్, ఎమ్మెల్యే గడ్డం వివేక్, బాలనరసింహ, వీఎస్ నిర్మల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

16 వరకు ఇంటర్ పరీక్ష ఫీజుకు గడువు

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఇంటర్‌బోర్డు మరోసారి పొడిగించింది. రూ. 2,500 ఆలస్య రుసుముతో ఈ నెల 16 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఇచ్చింది. ఇప్పటి వరకు ఫీజు చెల్లించని వారంతా ఈ నెల 16లోపు ఫీజు చెల్లించాలని బోర్డు కార్యదర్శి క్రిష్ణ ఆదిత్య సూచించారు.

ఇగ్నో స్కూల్ బోర్డు సభ్యుడిగా బానోత్ ధర్మ

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) స్కూల్ బోర్డు సభ్యుడిగా రాష్ట్రానికి చెందిన డాక్టర్ బానోత్ ధర్మ నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన రెండేండ్లపాటు కొనసాగనున్నారు. ఇగ్నో ఇటీవలే నియామకపు ఉత్తర్వులు జారీచేసింది. డాక్టర్ బానోతు ధర్మ ప్రస్తుతం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో విద్యార్థి సేవల విభాగం జాయింట్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. వర్సిటీ అధికారులు ధర్మను అభినందించారు.

నర్సుల రిజిస్ట్రేషన్ పేరుతో ఫేక్ కాల్స్

నమ్మొద్దని కోరిన ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్

హైదరాబాద్, జనవరి 6 (నమస్తే తెలంగాణ): నర్స్ రిజిస్ట్రేషన్ అండ్ ట్రాకింగ్ సిస్టమ్(ఎన్ఆర్డీఎస్) అధికారులమని చెప్పి కొందరు సైబర్ నేరగాళ్లు నర్సులను మోసం చేస్తున్నారని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) తెలిపింది. తాము చెప్పినట్టు వినకుంటే రిజిస్ట్రేషన్ రద్దవుతుందని బెదిరిస్తున్నారని పేర్కొన్నది. ఇలాంటివారిని నమ్మవద్దని సూచించింది. ఎన్ఆర్డీఎస్ గురించి ఐఎన్‌సీ నేరుగా నర్సులకు ఫోన్ చేయదని స్పష్టంచేసింది. నర్సుల్లో ఎవరికైనా రిజిస్ట్రేషన్ సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే తమకు ఈ-మెయిల్ చేయాలని సూచించింది. ఎవరైనా సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దని తెలిపింది.

సప్తగిరి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్